
• కథానిక

# మంచికి మరోపేరు

'' అసలు కథ ఇప్పుడే ఎందుకు మొదలైంది



పి.వి.మురళీకృష్ణ

క్యాంటీన్‌లో ఒక్కటే గోల. అందరి నోట్లోనూ ఒక్కటే మాట. 'కొత్త కలెక్టర్ వచ్చేస్తున్నారు! కొత్త కలెక్టర్ వచ్చేస్తున్నారు!'

దాదాపుగా ఒక నెల క్రితం ఖాళీ అయ్యింది కలెక్టర్ పదవి. అప్పటినుంచి మరో శాఖకు చెందిన అధిపతే ఈ శాఖ వ్యవహారాలు చూస్తున్నారు. అప్పుడప్పుడు ఎవరో వస్తున్నారంటూ మధ్యాహ్నం క్యాంటీన్ సమావేశాల్లో చెదురుమదురుగా అనుకుంటున్నప్పటికీ ఈవాళింతటి ఉధృతం ఎప్పుడూ లేదు.

ఎవరో అడిగారు 'గోపాలచారి గారు ఫలానా జిల్లా కలెక్టరుగా వున్నారు కదూ?'

ఇంకెవరో చెప్పారు 'అవును!'

ఇంక దీంతో చర్చ మొదలయింది.

'ఆయన ఎలాంటివాడో ఎవరికైనా తెలుసా?'

'ప్చ్!'

'తెలీదూ!'

'ఓ...నో!'

ఏదో నిరాశతో 'అంతేనా?'

అప్పుడే క్యాంటీన్‌లోకి అడుగుపెట్టిన ఓ యు.డి.సి అడిగాడు 'ఏమిటీ చర్చ?'

'అదే గురూ. మన కొత్త కలెక్టరుగా వస్తున్న గోపాలచారి గారిని గురించి. సెక్రటేరియట్ నుంచి నమ్మకంగా వచ్చిందీ వార్త. ఆయనెలాంటివాడో అని..'

'ఓస్..అంతేనా?' కొట్టి పారేశాడు యు.డి.సి

'నీకు తెలుసా?'

'అమ్మయ్యా! అయితే నీకు తెలుసన్నమాట!'

'జెర జల్దీ చెప్పభాయ్!'

'వుండుం డండీ' కాలర్ సర్దుకున్నాడు యు.డి.సి. ఆయన గురించి చెప్పాలంటే ఎంత లేదన్నా కనీసం ఓ రోజయినా పడుతుంది.

'ఆ!'

'అమ్మో!'

'అవును. అయినా క్లుప్తంగా చెబుతాను' మరోమారు కాలర్ సర్దుకుని కూచోడానికి ప్రయత్నించాడు యు.డి. సి

కానీ కూచోడానికి గురివింద గింజంత చోటు కూడా లేదు క్యాంటీన్‌లో. ఉత్సుకత ఆపుకోలేని ఎవరో చటుక్కున లేచి ఆహ్వానించారు యు.డి.సి.ని

'మంచికి మరో పేరు' అన్నాడు యు.డి.సి కూచుంటూ ఉపోద్ఘాతం ప్రారంభమయిందన్నట్టుగా.

'ఎవరు?'

'కౌన్ భాయ్?'

'మీరంతా ఎవర్ని గురించి మాట్లాడుకుంటున్నారో, ఆయనే..! ఏం మీకు నమ్మకం కుదరడం లేదా?'

'అహా!'

'అలా..గా?'

'అవును. అబ్రహం లింకన్ తరువాత, గాంధీగారి తరువాత భూమిమీద అలాంటి వ్యక్తి ఇంకొకరున్నారంటే, ఆయన నిస్సందేహంగా గోపాలాచారి గారే!'

'ఇదంతా నీకెలా తెలుసు తమ్మీ!'

'జెర జల్దీ చెప్పనాయ్నా!'

'జెరేంది? బాగానే చెబుతాను. కాకినాడ కలెక్టరేట్ ఆఫీసులో నా స్నేహితుడొకడు పనిచేస్తున్నాడు. వాడే చెప్పాడు!'

'ఏమని చెప్పాడు?'

'ఆయన దగ్గర పనిచెయ్యడం ఒక వరం లాంటిదని!'

'అట్లాగయితే మనం చాలా అదృష్టవంతులమ్!'

'అవును. ఉదాహరణకు చెప్పాలంటే చాలా చెప్పవచ్చు. పాకీవాడు పోయినా సరే, సగౌరవంగా ఆహ్వానిస్తాడు. ఆ వచ్చిన వ్యక్తి కూర్చున్న తరువాతనే తాను కూర్చుంటాడు. అంతేనా? మనమెక్కడయినా రోడ్డుమీద కనబడ్డామనుకోండి, మనం విష్ చేశామా లేదా అని ఆయనెప్పుడూ గమనించడు..'

'మరి..?'

'ఆయనే ముందర నమస్కారం చేస్తాడు. మనమే మాత్రం తెలిసున్నా!'

దాంతో ప్రధాన కార్యాలయమేమిటీ, నగరంలో దానికి సంబంధిత కింది కార్యాలయాల కంటె క్షణాల్లో పాకిపోయిందా తాజా వార్త. 'మహాత్ముడయిన ఒక వ్యక్తి మన కొత్త కలెక్టర్!'

అందరూ అనుకున్నట్టుగానే గోపాలాచారిగారే కొత్త కలెక్టరుగా వచ్చారు.

మాకు సంబంధించిన అసిస్టెంట్ డైరెక్టర్ గారు వెళ్ళి కలిసొచ్చారు. ఎంతయినా ఎవరోచెప్పింది వినడం, స్వయంగా తెలుసుకోవడం వేరు కదా..!'

'మన కొత్త కలెక్టరు గారూ..'

'ఆయన కేమయ్యా? సాక్షాత్తు శ్రీరామచంద్రుడంతటి వాడు. ఏం మర్యాద! ఏం గౌరవం! తల తిరిగిపోయిందనుకోండి. మేమంతా లోపలికెళ్ళామా? ఆయనే ముందుగా లేచి మమ్మల్ని కూచోమన్నారు. కూచుంటూ వుంటే ప్రతి ఒక్కరితో కరచాలనం చేశారు. మేమంతా కూర్చున్న తరువాతనే ఆయన కూర్చున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్ రమణయ్య గారి అద్భుతమైన ప్రశంస.

'అమ్మయ్యా!' అందరూ ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నారు.

కథ ఇంతటితో పూర్తయింది. అయితే దయచేసి కొంచెం ఆగాలి. ఎందుకంటే ఇప్పుడే అసలు కథ మొదలయ్యింది కనుక!

ఓ వారంరోజులు హాయిగా గడిచిపోయాయి.

ఆరోజు అసిస్టెంట్ డైరెక్టరు రమణయ్యగారికి తీరిక లేని రోజు. ఎక్కువ **పనుండి** కాదు, కొందరిని ఎక్కించే పనుందని.

కొంతకాలం క్రితం ఖాళీగా వున్న రెండు ఎల్.డి.సి ఉద్యోగాలు నింపే ఉద్దేశ్యంతో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి వారికి వ్రాయబడింది. వారు పంపిన పన్నెండు మంది అభ్యర్థులు ఇదిగో ఇవాళ అసిస్టెంట్ డైరెక్టర్ రమణయ్యగారి దగ్గర తమ భవిష్యత్తు నిర్ణయించుకునే విషయంలో విఘ్నేశ్వర పూజానంతరం హాజరవుతున్నారు.

కానీ,

ప్రధానకార్యాలయంలోని కుర్చీలన్నీ నిండక ముందే, కలెక్టరు దగ్గరి నుండి తాఖీదు వచ్చింది రమణయ్యగారిని వెంటవే రమ్మవమని.

రమణయ్యగారు పాతకాలం నాటి ప్యాంటుని పైకి లాక్కుంటూ, ఆదరాబాదరాగా కలెక్టరుగారిని చేరారు.

కలెక్టర్ కూర్చోమంటూ ఒక్కటే మాట చెప్పారు 'ఇంటర్వ్యూలు స్వయంగా నేనే చేస్తాను!'

'చిత్తం!' రమణయ్యగారు కూర్చోనైనా కూచోకుండా వెనుతిరిగి వచ్చారు.

క్షణాల్లో ఆఫీసంతా మారుమ్రోగిపోయింది. 'ఇంటర్వ్యూలు కలెక్టరుగారే స్వయంగా చేస్తున్నారు. ఎప్పుడయినా ఏ కలెక్టరయినా ఇంత శ్రద్ధ తీసుకున్నాడా? మహానుభావుడు మన కలెక్టరు గారు. నిజంగానే మహాత్ముడు!'

రమణయ్యగారు జారిపోతున్న ప్యాంటునుపైకన్నా లాక్కోకుండా ఖాళీలకు సంబంధించిన కవర్‌లోనుంచి కాగితం పైకి లాగి ఇలా వ్రాశారు.

పునస్కరణ: ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి వారి ఉత్తరం సంఖ్య... తేదీ....

సమర్పణ: పైన పేర్కొన్న పునస్కరణ ద్వారా ప్రధాన కార్యాలయంలో ఉత్పన్నమయిన రెండు ఎల్.డి.సి ఉద్యోగాలకు సంబంధించిన ఖాళీలు నింపుకొనుటకై ఈ క్రింది అభ్యర్థులు పంపబడ్డారు.

1. పి.సురేష్‌కుమార్
2. ఇ.వంశీకృష్ణ
3. బి.ఆదర్శ్‌కుమార్
4. బి.సుధీర్‌రెడ్డి
5. ఎం.ఆదిత్యకుమార్
6. పి.లక్ష్మణాచారి
7. కె.సరితాప్రియ
8. డి.పావని
9. పి.కృష్ణసుధ
10. జి.డి.హనుమంతప్ప
11. ఎం.డి.రజాక్
12. ఎం.డి జమీర్ అహ్మద్

దయపూరిత ఆజ్ఞకై

సం. అసిస్టెంట్ డైరెక్టర్.

రమణయ్యగారు ఎండిపోయిన పెదవులయినా తడుపుకోకుండా జవాన్ను పిలిచి చక్కగా అలంకరించిన కవర్‌ను కలెక్టరుగారి దగ్గర వుంచమని, బయట వేచి వున్న అభ్యర్థులను కలెక్టరు గారి గది దగ్గర కూర్చోవలసిందిగా ఆజ్ఞాపించారు. కవర్‌ని అతి సున్నితంగా చేతిలోకి తీసుకుని 'మహానుభావుడు' అని అనుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు జవాను.

సాయంత్రమయింది.

అప్పటికి అందరి అభ్యర్థుల పరీక్షలు పూర్తయ్యాయి. కొత్త వేటగాడి బుల్లెట్‌లాగా, మైగజైన్ నుండి రిటర్నయిపోయి, వాపసొచ్చిన కొత్త రచయిత బుల్లికథలాగా తిరిగొచ్చిన కవర్‌లోనుంచి కాగితాన్ని అతివేగంగా పైకి లాగారు రమణయ్యగారు..


అందులో కలెక్టర్ గారి స్వహస్తాక్షరాలతో ఇలా లిఖించబడి వుంది.

అందరూ అభ్యర్థులు స్వయంగా పరీక్షించబడ్డారు. [illegible] సంఖ్యలో పేర్కొనబడిన అభ్యర్థిని చేర్చుకో[illegible]. మరో ఖాళీ నింపుటకై వెంటనే లిఖి[illegible] వ్రాయవలెను.

సం.కలెక్టర్

మరుసటిరోజు క్యాంటీన్ సమావేశంలో కలెక్టరు గారు స్వయంగా పూనుకుని స్వీకరించిన అభ్యర్థిని 'మంచికి మరో పేరు'గా తీర్మానించబడింది.

## చదరంగం



**చ**దరంగం ఆట మొదట భారత దేశంలోనే పుట్టింది. చదరంగం ఆట ఒకప్పుడు రాజుల క్రీడగా వుండేది. 'చతురంగం' అనేదే 'చదరంగం'గా మారింది. చతురంగం అంటే కాల్బలం (సైనికులు), రథ బలం, అశ్వబలం, గజబలం అన్న నాలుగు విభాగాలూ కలిపి, ఇవన్నీ యుద్ధతంత్రానికి సంబంధించినవి కనుక బహుశా ఈక్రీడ రాజ దర్బారులలోనే ఆవిర్భవించి, కాలక్రమేణా అనేక మార్పులు పొంది వుండవచ్చు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం ప్రపంచ క్రీడలన్నింటికీ ఇదే అతి పురాతనమైనది అని.

ప్రకారం చదరంగం జన్మస్థానం భారత దేశమే చారిత్రక సాక్ష్యాధారాల ప్రకారం ఈ క్రీడకి కనీసం ఐదు వేల సంవత్సరాల చరిత్ర వుంది. ఇందులో రెండు వేల సంవత్సరాల వరకు ఇది భారత దేశానికి మాత్రమే పరిమితమయింది.

క్రీ.శ. 6వ శతాబ్దంలో పర్షియా (నేటి ఇరాన్)కి, అక్కడ నుంచి అరబ్బులకు ప్రాకింది. తరువాతి కాలంలో తుర్కుల నుంచి జెరుసలెమ్‌ను తిరిగి ఆక్రమించుకోడానికి దండెత్తి వచ్చిన క్రూసే డేరాల ద్వారా ఈ ఆట యూరప్‌కి వ్యాపించింది.

ఇంగ్లండ్‌లో ఈ చదరంగం తొలిసారిగా 1255వ సంవత్సరంలో ప్రవేశించింది.

క్రమేపీ ఇది అంతర్జాతీయ పరిగణన పొందడంతో 1851లో లండన్‌లో తొలి అంతర్జాతీయ చదరంగ పోటీలను నిర్వహించారు. 1924లో ఫ్రాన్స్‌లో ఇంటర్నేషనల్ ఫెడేషన్ ఆఫ్ చెస్ ప్లేయర్స్‌ను స్థాపించారు. ప్రపంచ వ్యాప్తమైన తరువాత ఈ క్రీడా రష్యనుల జాతీయ క్రీడ అయింది..

డాక్టర్ ఇమాన్యుయెల్ లాస్కర్ అనే జర్మన్ ఆటగాడు 1894 నుంచి 1921 వరకు ఏకధాటిగా 27 సంవత్సరాల పాటు ప్రపంచ ఛాంపియన్ అయ్యాడు.

ఈ ఆటని మొట్ట మొదట వర్ణించిన రచయిత 12వ శతాబ్దం నాటి ఒక క్రైస్తవ సన్యాసి. ఆ పుస్తకం ఇంగ్లీష్ అనువాదాన్ని 'ది గేమ్ అండ్ ప్లేస్ ఆఫ్ ది చెస్' అనే పేర కాక్స్టన్ తన తొలి పుస్తకంగా ప్రకటించాడు.

శ్రీకొండ (యొర్రబోదు)